# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-09-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **తిరుమలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండో రోజు పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.**

2. **గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి 10 వేల కోట్ల రూపాయలతో పనులు చేపడుతున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు.**

3. **రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను అత్యాధునిక వసతులతో అభివృద్ధి చేస్తున్నామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు.**

4. **రాష్ట్ర పోలీసు శాఖలో 2 వేల 50 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ ను విడుదల చేసింది.**

==========================

తిరుమలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండో రోజు పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా తొలుత వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద యాత్రికుల ఎక్స్ పీరియన్స్ కేంద్రాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. స్వామివారికి నిర్వహించే , పూజా కార్యక్రమాలు, తిరుమల విశిష్టతలను భక్తులు తిలకించేలా త్రీడీ వీడియో ప్రదర్శనలతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం నారాయణగిరి సర్కిల్ వద్ద 32 విద్యుత్ బస్సులను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించి ఒక ఎలక్ట్రిక్ బస్సులో నారాయణగిరి సర్కిల్ నుంచి ఎస్వీ మ్యూజియం వరకు ప్రయాణించారు. అలాగే తిరుమలలో ఆధునికీకరించిన ఎస్వీ మ్యూజియాన్ని కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. కృత్రిమ మేధస్సు ఆధారిత వీడియో ద్వారా స్వామివారి పరిణయ విశేషాలతో పాటు తిరుమల ఏడు కొండలు, ఆలయాలు, శిల్పాలు, ప్రకృతి విశేషాలను వివరించే త్రీడీ నమూనాలను ముఖ్యమంత్రి తిలకించారు.

--------------------------

పునరుద్ధరించిన పంపిణీ రంగ పథకం –ఆర్‌డీఎస్ఎస్ కింద గ్రామీణ విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి సుమారు 10 వేల కోట్ల రూపాయలతో పనులు చేపడుతున్నట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. విజయవాడ గుణదలలో 28 మంది ఉద్యోగార్థులకు కారుణ్య నియామక ఉద్యోగ పత్రాలను మంత్రి ఈ రోజు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు కారుణ్య నియామకాల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చర్యలు

తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ట్రాన్స్‌కో, జెన్‌కో వంటి విద్యుత్ సంస్థల్లో ఇప్పటివరకు 389 మందికి కారుణ్య నియామకాలు చేపట్టినట్లుతెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సౌర, పవన ప్రాజెక్టులను ప్రోత్సహిస్తున్నామని మంత్రి చెప్పారు.

---------------------------

ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణ అభివృద్ధి పనులపై అధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. పనుల నాణ్యత, వేగంగా పూర్తి చేయడం, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టడంపై అధికారులు, సంబంధిత ఏజెన్సీలకు మంత్రి పలు సూచనలు చేశారు. పాలకొల్లులో సుమారు 76 వేల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించినట్లు తెలిపారు. పాలకొల్లులో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను అత్యాధునిక వసతులతో అభివృద్ధి చేస్తున్నామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. నెల్లూరు నగరంలో 21 కోట్ల రూపాయలతో ఆధునికీకరించిన ఆర్.ఎస్.ఆర్. నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల, డి.ఎస్.ఆర్. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను మంత్రి ఈ రోజు ప్రారంభించారు. మంత్రులు పొంగూరు నారాయణ, ఎన్.ఎం.డి. ఫరూక్, నెల్లూరు లోక్‌సభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఒక ప్రభుత్వ పాఠశాలను ఆదర్శ పాఠశాల తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. భవిష్యత్తులో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు కొత్త రూపును తీసుకువస్తామని మంత్రి వివరించారు.

---------------------------

మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడే సమాజం, దేశం మరింత సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. దక్షిణాఫ్రికాలో జరుగుతున్న 69వ కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సులో “మహిళా సాధికారత, లింగ సమానత్వం” అనే అంశంపై ఆమె ప్రసంగించారు. 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచే మహిళలకు సమాన ఓటు హక్కు, సమానత్వాన్ని భారత్ కల్పించిందని అన్నారు. ప్రస్తుతం మహిళల అభివృద్ధి నుంచి మహిళల నేతృత్వంలోని అభివృద్ధి దిశగా భారత్ పయనిస్తోందని పేర్కొన్నారు. 73వ, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థల్లో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించడం నుంచి, నారీ శక్తి వందన్ అధినియం ద్వారా పార్లమెంట్, శాసనసభల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచే దిశగా భారత్ అడుగులు వేస్తోందని తెలిపారు.

---------------------------

రాష్ట్ర పోలీసు శాఖలో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ ను విడుదల చేసింది. ఎస్సై, కానిస్టేబుల్ సహా మొత్తం 2 వేల 50 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు రాష్ట్ర స్థాయి పోలీసు నియామక మండలి ప్రకటించింది. వీటిలో ఎస్సై విభాగంలో సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్–ఎఆర్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ –ఎస్పీఎఫ్, కమ్యూనికేషన్ విభాగాలకు సంబంధించి పోస్టులు ఉన్నాయి. కానిస్టేబుల్ విభాగంలో సివిల్, జైళ్ల శాఖతో పాటు కమ్యూనికేషన్ విభాగంలో పోస్టులను భర్తీ చేయనున్నారు. అదేవిధంగా పోలీసు రవాణా విభాగంలో మెకానిక్, డ్రైవర్ పోస్టులతో

పాటు సైంటిఫిక్ అసిస్టెంట్ పోస్టులను కూడా భర్తీ చేయనున్నారు. రాత పరీక్షకు సంబంధించిన తేదీలను త్వరలో వెల్లడించనున్నామని పోలీసు నియామక మండలి తెలిపింది.

---------------------------

అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం గంగినేనిపాలెం గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించి, మరికొన్ని పనులకు ఈ రోజు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మైలవరం నియోజకవర్గవ్యాప్తంగా పంచాయతీ రహదారుల అభివృద్ధికి సుమారు 20 కోట్ల రూపాయలతో పనులు చేపట్టామని తెలియజేస్తూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ తెలిపారు. అమరావతిలో ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ ఆయన... జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్, ధన్ ధాన్య కృషి యోజన వంటి పథకాల ద్వారా ప్రజలకు వివిధ రంగాల్లో ప్రయోజనాలు అందుతున్నాయని పేర్కొన్నారు.

వాయిస్ 31 సెకన్లు

---------------------------

అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని ఈరోజు ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. సూర్యుని నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాలు భూమిని నేరుగా తాకితే, మానవులతో పాటు సమస్త జీవరాశికి తీవ్ర ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. ఈ హానికరమైన కిరణాల నుంచి భూమిని రక్షించడంలో ఓజోన్ పొర కీలక పాత్ర పోషిస్తోంది. అయితే, పర్యావరణ మార్పుల కారణంగా ఓజోన్ పొర క్షీణిస్తున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఓజోన్ పొరను పరిరక్షించేందుకు ప్రపంచ దేశాలు 1987 సెప్టెంబర్ 16న కెనడాలోని మాంట్రియల్‌లో “మాంట్రియల్ ప్రోటోకాల్”పై ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ చారిత్రక ఒప్పందాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా సెప్టెంబర్ 16న అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

---------------------------

ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించి కొత్త నిబంధనలు -- 2026ను కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చింది. ఈ నిబంధనలు ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం, వృత్తాకార ఆర్థిక వ్యవస్థ, విస్తరించిన ఉత్పత్తిదారు బాధ్యత సూత్రాలకు నిబంధనల్లో ప్రాధాన్యత ఇచ్చారు. వ్యర్థాలను ఉత్పత్తి చేసే ప్రదేశంలోనే నాలుగు వర్గాలుగా వేరు చేయడం తప్పనిసరి చేశారు. వ్యర్థాల సరైన విభజన, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. నిబంధనలు ఉల్లంఘించిన సందర్భాల్లో ‘కాలుష్య కారకుడే చెల్లించాలి’ అనే సూత్రం ఆధారంగా పర్యావరణ నష్టపరిహారం విధించేలా నిబంధనలు రూపొందించారు.

=====================